సాక్షి
కాకినాడ
ఆదివారం | 22 | సెప్టెంబర్ | 2024



విఘ్నేశ్వరుని ఆలయానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయానికి రాజమహేంద్రవరానికి చెందిన దేవులపల్లి వెంకట సుబ్బారావు, ప్రతిమ దంపతులు శనివారం రూ.1,01,116 విరాళం ఆలయ ఈఓ సత్యనారాయణరాజుకు అందించారు.




శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా..

శ్రీనివాసా.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 1,62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

రేపు బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం: ఆంధ్రప్రదేశ్ మినీ బాల బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలబాలికల జట్లను ఈనెల 23న ఎంపిక చేయనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు శనివారం తెలిపారు. ఈ నెల 23వ తేదీన రామచంద్రపురం కంతేటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో బాలురకు చాంపియన్‌షిప్ పోటీలు, బాలికలకు జిల్లా జట్టు కోసం ఎంపికలు జరుగుతాయన్నారు. వీటిలో పాల్గొనే జట్లు ఉదయం ఎనిమిది గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలని క్రీడాకారులు 2011 జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారే అర్హులని మాణిక్యాలరావు తెలిపారు. ఈ పోటీలకు వచ్చే క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

గ్రేడ్1 ఏపీపీల బదిలీలు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) గ్రేడ్–1 కు బదిలీలు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.

▸▸ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు ఏపీపీ గ్రేడ్–1 అండ్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా పనిచేస్తున్న వై.ప్రశాంతి కుమారి బదిలీపై బంగోలు నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు, స్పెషల్ ఎస్సీ, ఎస్టీ కోర్టుకు ఏపీపీ గ్రేడ్–1గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో విజయనగరం స్పెషల్ ఎస్సీ, ఎస్టీ కోర్టుకు ఏపీపీ గ్రేడ్–1గా పనిచేస్తున్న పీవీఎన్ జయలక్ష్మిని నియమించారు.


▸▸ రాజమహేంద్రవరం 1వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు ఏపీపీ గ్రేడ్–1 జీఎస్ఎన్‌వీ ప్రసాద్ రావును విశాఖపట్నం 1వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు ఏపీపీ గ్రేడ్–1 అండ్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా నియమించారు. ఆయన స్థానంలో ఏలూరు 1వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్–1గా పనిచేస్తున్న కె.లక్ష్మణ నాయక్‌ను నియమించారు.

▸▸ ఏలూరు స్పెషల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏపీపీ గ్రేడ్–1గా పనిచేస్తున్న డి.శ్రీవాణిబాయిని బదిలీపై రాజమహేంద్రవరం 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు ఏపీపీ గ్రేడ్–1గా నియమించారు.

రేపటి నుంచి గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సోమవారం నుంచి 26 వరకూ మహిళలకు గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీజీహెచ్‌లో ప్రసూతి, గైనకాలజీ, రేడియేషన్ అంకాలజీ విభాగాలు గర్భాశయ క్యాన్సర్‌ను నిరోధించేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తిగల మహిళలు జీజీహెచ్‌లోని ఎస్ఆర్ఎంటీ బ్లాక్ వద్ద పరీక్షలు చేయించుకోవచ్చునన్నారు. ఈ నాలుగు రోజుల్లో సుమారు 500 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరీక్షలకు హాజరయ్యే మహిళలు తమ వివరాలను 88852 53889 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవచ్చునన్నారు.

డీఎస్ఏలో స్వచ్ఛత హీ సేవ



కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు జిల్లాలో జరుగుతున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా క్రీడామైదానంలో పరిసరాల శుభ్రత కార్యక్రమం నిర్వహించినట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంగణంలోని క్రీడాకారులు వారివారి క్రీడా పరిసరాలను శుభ్రం చేసుకున్నారన్నారు. సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, బ్యాడ్మింటన్, రైఫిల్ షూటింగ్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్, ఆర్చరీ, కబడ్డీ పోటీలల్లో 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారన్నారు.

నేడు అథ్లెటిక్స్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా క్రీడామైదానంలో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. అండర్–14, 16, 18, 20 విభాగాల్లో నిర్వహించే ఎంపికలకు ఆసక్తి ఉన్న వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 8 గంటలకు హాజరు కావాలన్నారు.

రెవెన్యూపై కుర్చీలాట!

- బదిలీల్లో అవినీతి రిజిస్ట్రేషన్
- రూ.లక్షల్లో పలుకుతున్న సీట్లు
- ఫైనలిస్తే కోరుకున్న చోటు
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే బదిలీలు
- నేడు సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్



ఆటల్లో ఇండోర్ గేమ్స్ ఎన్నో ఉన్నాయి. రింగా రింగా రోజెస్.. ఒప్పులగుప్ప వయ్యారి భామా.. మ్యూజికల్ చైర్స్.. ఇలా ఎన్నో ఒక సర్కిల్‌కు పరిమితమై కొందరు ఆడుతుంటారు. ఆ సర్కిల్ పరిధి దాటి వెళ్లేవారు అవుటైపోయినట్టే. మళ్లీ వచ్చే గేమ్ దాకా సర్కిల్‌లోకి రారు. జిల్లాలో రిజిస్ట్రార్ల బదిలీ.. వారి వ్యవహార శైలి ప్రక్రియ చూస్తుంటే అదే గుర్తొస్తుంది. జిల్లాలో పనిచేసేందుకు అలవాటు పడిన ఈ శాఖ సిబ్బంది జీతానికి మించి వస్తున్న గీతానికి బాగా అలవాటు పడి ఇక్కడ నుంచి వెళ్లడానికి ఇష్టపడడంలేదు. అనివార్య కారణాల వల్ల ఇతర జిల్లాలకు బదిలీ అయినా ఎలాగోలా పైరవీలు చేసుకుని మళ్లీ ఇక్కడికే వచ్చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ప్రతి పనికీ చేయి తడపాల్సిందే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిమాండ్ ఉన్న సీట్ల కోసం రూ.50 లక్షల వరకు సమర్పించుకుంటున్నారంటే వారి అదనపు రాబడి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. జిల్లాలో ఏ స్థానానికైనా పర్లేదు కానీ మరే జిల్లాకూ వెళ్లేందుకు వారు ఇష్టపడడం లేదు. ఈ సర్కిల్ దాటి పోకుండా ఉండడానికి శత విధాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరు ఏ సీటు దక్కించుకుంటారో చూడాలి మరి.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలనే ఫార్ములా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖలో పక్కాగా నడుస్తోంది. జిల్లా రిజిస్ట్రార్ పోస్టింగుల కోసం నేతలు, ఉన్నతాధికారులకు రూ.లక్షలు పెట్టి వచ్చిన వారు ఇప్పుడు అదే చోట రికవరీ వేటలో పడ్డారు. పైనుంచి కింది వరకు పైసలు లేనిదే బదిలీలు కావనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందునా కోరుకున్న చోటు కావాలంటే రూ.లక్షలు కుమ్మరించాల్సిందే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పూర్వపు కాకినాడ, రాజమహేంద్రవరం రిజిస్ట్రేషన్లకు జిల్లాల ప్రాతిపదికన శనివారం మొదలైన బదిలీల ప్రక్రియ సెలవు దినమైనా ఆదివారం కూడా కొనసాగించేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సబ్ రిజిస్ట్రార్ పోస్టింగ్‌ల దగ్గర నుంచి ఆఫీసు సబార్డినేట్ పోస్టుల వరకు అన్నింటికీ చోటుకో రేటు నిర్ణయించారు. కోరుకున్న సీటు కావాలంటే కప్పం కట్టాల్సిందే. ఇప్పటికే ముగిసిన జిల్లా రిజిస్ట్రార్ల బదిలీలలో కొన్నింటికి ఇదే జరిగింది. కొందరు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు అధికార పార్టీ నేతలు, ఉన్నతాధికారులకు సమర్పించుకున్నారు. రిజిస్ట్రేషన్లు దండిగా జరిగే డిమాండ్ ఉన్న పోస్టింగుల కోసం రూ.50 లక్షలు ఇచ్చుకున్న వారు కూడా ఉన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో పనిచేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ల బదిలీల్లో ఈ జిల్లాలు దాటి బయటకు వెళ్లకుండా సర్దుబాటు చేసుకోగలిగారు. గతంలో రాజమహేంద్రవరంలో పనిచేసిన డీఆర్ఆర్ సత్యనారాయణ బదిలీపై భీమవరం వెళ్లారు. తిరిగి అక్కడి నుంచి బదిలీల్లో రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్‌గా వచ్చారు. ఒకప్పుడు కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసిన సీహెచ్ నాగలింగేశ్వరరావు బదిలీపై కర్నూలు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు డీఆర్‌గా బదిలీపై వచ్చారు. గతంలో కాకినాడలో పనిచేసి రాజమహేంద్రవరానికి డీఆర్‌గా వెళ్లిన కె.ఆనందరావు తాజా బదిలీల్లో రాజమహేంద్రవరం నుంచి కాకినాడ డీఆర్‌గా వచ్చారు. డీఆర్ పోస్టింగుల కోసం రూ.లక్షలు సమర్పించుకున్న వారిలో కొందరు ప్రస్తుతం జరుగుతున్న దిగువ కేడర్ బదిలీల ద్వారా రికవరీలో పడ్డారంటున్నారు.

ఒకే చోట రెండేళ్లు పూర్తి అయిన వారిని కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేయాల్సి ఉంది. పైకి కౌన్సెలింగ్ అని చెబుతున్నా అంతర్గతంగా మాత్రం పైసలిచ్చిన వారికి కోరుకున్న స్థానాలు దక్కేలా చీకటి ఒప్పందాలు ఇప్పటికే పూర్తి అయ్యాయంటున్నారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, కొందరు ఉన్నతాధికారులు రూ.లక్షలు వెనకేసుకుని పకడ్బందీగా బదిలీల ప్రక్రియ నడిపిస్తున్నారని రిజిస్ట్రేషన్ శాఖ కోడైకూస్తోంది. ఉమ్మడి జిల్లాలో డిమాండ్ ఉన్న సబ్ రిజిస్ట్రార్ పోస్టుల కోసం ఒకరి కంటే ఎక్కువ మంది ఆశిస్తూ పోటీపడుతున్నారు. కాకినాడ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో కాకినాడ జాయింట్–1, జాయింట్–2, సామర్లకోట, పెద్దాపురం, తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్ పోస్టుల కోసం గట్టి పోటీ నడుస్తోంది. ఈ సబ్ రిజిస్ట్రార్ పోస్టింగ్‌లపై ముందుగానే ఒక ఒప్పందానికి వచ్చేసినట్టుగా రిజిస్ట్రేషన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వీటిలో అత్యధిక డిమాండ్ ఉన్న జాయింట్–1, జాయింట్–2 పోస్టింగుల కోసం కోనసీమ, రాజమహేంద్రవరం జిల్లాలలోని సబ్ రిజిస్ట్రార్లు ఏడెనిమిది లక్షల రూపాయలకు బేరసారాలు నడిపారు. రాజమహేంద్రవరం జాయింట్–1 జాయింట్–2, పిడింగొయ్యి, రాజానగరం, కడియం సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు డిమాండ్ అధికంగా ఉండడంతో రేట్లు పెంచేశారు. ముందుగా జరిగిన ఒప్పందం ప్రకారం రాజమహేంద్రవరం జాయింట్–1, 2 పోస్టింగ్‌లకు, కాకినాడ జాయింట్–1, 2 పోస్టింగుల మాదిరిగానే రూ.ఐదారు లక్షలు పలికింది. ఈ పోస్టింగ్‌లకు డిమాండ్ పెరగడంతో రూ.ఏడెనిమిది లక్షలకు పెంచేశారంటున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో అమలాపురం జాయింట్–1 జాయింట్–2, ముమ్మిడివరం, రావులపాలెం, మండపేట సబ్ రిజిస్ట్రార్ పోస్టింగ్‌ల కోసం బేరసారాలు కొలిక్కివచ్చాయి. సబ్ రిజిస్ట్రార్లతో పాటు సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఏలూరు రేంజ్ డీఐజీ (నోడల్ డీఐజీ) ఆదివారం బదిలీల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ బదిలీలలో ముడుపుల వ్యవహారాన్ని విజయవాడలో ఒక ఉద్యోగ సంఘానికి చెందిన నాయకుడు చక్కబెట్టారని విశ్వసనీయ సమాచారం.



కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కౌన్సెలింగ్‌కు ఎదురుచేస్తున్న ఉద్యోగులు

శనివారం ప్రారంభమైన జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీసు సబార్డినేట్‌ల బదిలీల్లో కూడా పెద్ద ఎత్తున సొమ్ములు చేతులు మారాయి. కోరుకున్న చోటు కావాలనుకునే జూనియర్ అసిస్టెంట్‌లు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు, ఆఫీసు సబార్డినేట్‌లైతే రూ.లక్ష తక్కువగాకుండా నిర్ణయించారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. మధ్యాహ్నం రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో బదిలీల ప్రకియ ప్రారంభమై రాత్రికి ముగిసింది. ఇవి రాజమహేంద్రవరం డీఆర్, కోనసీమ జిల్లా రిజిస్ట్రార్ సమక్షంలో పూర్తయ్యాయి. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో బదిలీలు రాత్రికి మొదలయ్యాయి. పూర్వపు కాకినాడ డీఆర్ పరిధిలో 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 45 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు ఆఫీసు సబార్డినేట్లు పనిచేస్తున్నారు. పూర్వపు రాజమహేంద్రవరం డీఆర్ పరిధిలో 18 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్లు సుమారు 60 మంది వరకు ఉన్నారు. ఈ బదిలీల ప్రక్రియ ఏ సమయానికి పూర్తి అవుతాయనేది ఇదమిద్ధంగా చెప్పలేమని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు చెబుతున్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 25 వేల మంది
- దేవస్థానం ఆదాయం రూ.25 లక్షలు
- ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం: రత్నగిరిపై కొలువైన వీర వేంకట సత్యనారాయణ స్వామి ఆలయంలోని ప్రాంగణాలు శనివారం వేలాదిగా వచ్చిన భక్తులతో నిండిపోయాయి. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, రెండు వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షలు ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు అన్నప్రసాదం పెట్టారు. అలాగే సత్యదేవుడు, అనంతలక్ష్మీ, సత్యవతీదేవి అమ్మవారి ప్రాకారసేవ కన్నులపండుగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అమ్మవారికి ప్రాకారసేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది



లోవ దేవస్థానంలో హుండీల నగదు లెక్కిస్తున్న సిబ్బంది

లోవకు రూ.24 లక్షల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మతల్లి కొలువైన లోవదేవస్థానానికి హుండీల ద్వారా రూ.24,07,159 ఆదాయం లభించిందని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. 48 రోజులకు శనివారం దేవదాయశాఖ పెద్దాపురం తనిఖీదారు సిహెచ్.ఉదయ్ బాబునాయుడు, గ్రూప్ టెంపుల్స్ ఈఓ కె.సోమరాజు, చైతన్య గోదావరి బ్యాంకు సిబ్బంది సమక్షంలో హుండీలను తెరిచి నగదు లెక్కించామన్నారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.2.52 లక్షలు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి రూ.2,51,987 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. స్వామివారిని తొమ్మిది వేల మంది భక్తులు దర్శించుకోగా, 4500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.



తిరుపతి శృంగారవల్లభ స్వామి

రంగరాయలో నానాజీ రచ్చ



ఆర్ఎంసీ వైద్య కళాశాల వద్ద ఆందోళనకు దిగిన దళిత సంఘాలు

- దళిత వైద్యుడిపై దౌర్జన్యానికి నిరసన
- ఆందోళనకు సిద్ధమవుతున్న దళిత సంఘాలు
- రాజీ కోసం ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు
- వెనక్కు తగ్గేది లేదంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో దళిత వైద్యుడిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దౌర్జన్యం చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఆర్ఎంసీ గ్రౌండ్‌లో వాలీబాల్ కోర్టు కోసం ఇంతటి రాద్ధాంతం చేయడం ఏమిటని ప్రజలు విస్తుపోతున్నారు. బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే అయి ఉండి ఒక దళిత వైద్యుడిని బండబూతులు తిడుతూ చంపుతానని ఏక వచనంతో బెదిరించడంపై దళిత సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి. డాక్టర్ ముఖానికి ఉన్న మాస్క్‌ను లాగి పిడిగుద్దులు గుద్దిన ఎమ్మెల్యే నానాజీ తీరుపై ఆయా సంఘాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఇదేదో ఒక వైద్యుడిపై జరిగిన దాడిగా చూసేదిలేదని, దళిత జాతిపై దాడిగా పరిగణించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆర్ఎంసీ గ్రౌండ్స్‌లో ఆందోళనకు దిగిన దళిత సంఘాల ప్రతినిధి సిద్ధాంతి కొండబాబు తదితరులు హెచ్చరిస్తున్నారు. ఆర్ఎంసీలో వైద్యుడిపై దాడి విషయమై తాము ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయాల్సిందేనని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం స్పష్టం చేశారు. మరో పక్క డాక్టర్ ఉమామహేశ్వరరావుకు మద్దతుగా మెడికోలు ఉద్యమ బాట పడుతున్నారు. వారు ఆందోళనకు దిగితే వైద్య సేవలు అందక పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటారని కలెక్టర్ షణ్మోహన్ సగిలి వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు వారు ససేమిరా అంటూ ఆందోళనకు సమాయత్తమవుతున్నారు. ఇదిలా ఉండగా ఆర్ఎంసీ గ్రౌండ్స్‌లో ఇటు ఎమ్మెల్యే, అటు వైద్యులతో కలెక్టర్ మాట్లాడుతున్నారు. ఈ వ్యవహారాన్ని ఏదో రకంగా రాజీ చేయాలని పై నుంచి ఒత్తిళ్లు వస్తుండటంతో అధికారులు రాజీకి ప్రయత్నిస్తున్నారు. అనుకోకుండా ఈ సంఘటన జరిగిపోయిందని ఎమ్మెల్యే నానాజీ వైద్యుడి చేతులు పట్టుకుని చెప్పేందుకు ప్రయత్నించగా ఆయన తమ విచక్షణకే వదిలేస్తున్నానని, కానీ ఫిర్యాదు చేసే విషయంలో వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన అంతా ఇలాంటి దౌర్జన్యాలకే పరిమితమైందంటూ ప్రజలు గర్హిస్తున్నారు. కూటమి ప్రజా ప్రతినిధులు ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుపుతున్న దౌర్జన్యాలు, దాడులకు శనివారం నాటి కాకినాడ సంఘటన పరాకాష్టగా నిలుస్తోందని మేధావి వర్గం ఆక్షేపిస్తోంది. దళితుల ఆందోళన కొనసాగుతోంది. ఆర్ఎంసీ మైదానంలో నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

సర్పవరం జంక్షన్‌లో ఫ్లైఓవర్!



కాకినాడ ముఖద్వారం సర్పవరం జంక్షన్



పిఠాపురం వైపు నుంచి కాకినాడ వైపు సర్పవరం జంక్షన్ మీదుగా రహదారి

- సాకారమైతే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు, నిధులూ సిద్ధం
- ఎన్నికల కోడ్‌తో బ్రేకులు
- క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

కాకినాడ రూరల్: కాకినాడ ముఖద్వారం సర్పవరం జంక్షన్‌లో ఫ్లై ఓవర్ ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాకినాడ నుంచి పిఠాపురం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు, విశాఖ నుంచి కాకినాడ మీదుగా యానాం, అమలాపురం, రామచంద్రపురం, మండపేట తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఈ జంక్షన్ చాలా కీలకం. సర్పవరం కూడలిలో నిత్యం వేలాది వాహనాల ద్వారా నిత్యం సుమారు లక్ష మంది రాకపోకలు సాగిస్తున్నారని అంచనా. సుదూర ప్రాంతాలలో పాటు సర్పవరం జంక్షన్ మీదుగా మాధవపట్నం, సర్పవరం, గైగోలుపాడు నుంచి రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, కోరమాండల్, పోర్టు తదితర ప్రాంతాలకు, కాకినాడ నుంచి రాయుడుపాలెం, తిమ్మాపురం, చిత్రాడ, పిఠాపురం తదితర ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కాకినాడ – పిఠాపురం వైపు వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సిగ్నల్ పడితే వాహనాలు ఇరువైపులా భారీగా బారులు తీరుతున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడ ముఖద్వారం కూడలిగా ఉన్న సర్పవరం జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలతో పాటు నిధులు కూడా సిద్ధం చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ క్రమంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్పెన్సర్స్ నుంచి మొదలై ఎస్ఆర్ఎంటీ మాల్ వరకు ఫ్లై ఓవర్ నిర్మించేందుకు యత్నిస్తోంది. ఇందుకు సంబంధించి కార్యాచరణపై అధికారులు సమాలోచనలు జరిపారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు ఇటీవల ఫ్లైఓవర్‌పై సమీక్షించారు. ఇది సాకారమైతే కాకినాడ–పిఠాపురం వైపు రాకపోకలు సాగించే వాహనాలకు ట్రాఫిక్ సమస్య లేకుండా, ఫ్లైఓవర్ కింద నుంచి సర్పవరం–వలసపాకల మధ్య వాహనాల రాకపోకలు సాగించేందుకు వీలుంటుంది.

29వ తేదీ నుంచి పలు రైళ్ల రద్దు



సామర్లకోట: కొవ్వూరు–కడియం రైల్వేస్టేషన్ల మధ్య సాంకేతిక మరమ్మత్తులు జరుగుతున్న దృష్ట్యా ఈనెల 29వ తేదీ నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకూ జిల్లా మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు రద్దు చేసినట్లు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ అధికారులు శనివారం తెలిపారు. 29వ తేదీన తిరుపతి–విశాఖపట్నం (22708), గుంటూరు–విశాఖపట్నం (17239), 30వ తేదీన (22707) విశాఖపట్నం –తిరుపతి, విజయవాడ –విశాఖపట్నం– విజయవాడ (12718/12717), విశాఖపట్నం–గుంటూరు–విశాఖపట్నం (22701/22702), గుంటూరు –విశాఖపట్నం(17239), విశాఖపట్నం– గుంటూరు(17240), విజయవాడ– రాజమహేంద్రవరం (07768), రాజమహేంద్రవరం– విశాఖపట్నం (07466), విశాఖపట్నం– రాజమహేంద్రవరం (07467), అక్టోబర్ ఒకటో తేదీన విశాఖపట్నం–గుంటూరు (17240) రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ రైళ్లలో రిజర్వేషన్ పొందిన ప్రయాణికులకు టికెట్ పూర్తి సొమ్ములు అందజేసేందుకు కౌంటర్లలో పూర్తి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పర్యాటకంగా కాకినాడ బీచ్ అభివృద్ధి

మంత్రి కందుల దుర్గేష్

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రూరల్ మండలం సూర్యారావుపేటలోని బీచ్ పార్కు, రిసార్ట్, శిల్పారామం, న్యూ ఎన్టీఆర్ బీచ్‌లను శనివారం సాయంత్రం ఆయన సందర్శించి పలు అభివృద్ధి పనులకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. కాకినాడ బీచ్ ఫెస్టివల్‌ను పునరిద్ధరిస్తామని, అక్టోబరు నాటికి బీచ్ పార్కును అభివృద్ధి చేసి ప్రారంభిస్తామన్నారు. పర్యాటక అభివృద్ధి కోసం కొత్త ప్రాజెక్టులు తయారు చేశామని, అక్టోబరు 1 నుంచి ఒక్కొక్కటిగా ఆచరణలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కాకినాడ బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, తుమ్మలపల్లి రమేష్, జేసీ రాహుల్ మీనా, ఆర్డీ స్వామినాయుడు తద్దిరులుపాల్గొన్నారు.



సూర్యారావుపేట బీచ్ పార్కును పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే నానాజీ తదితరులు

శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా..


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి


ఆలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం: శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా.. అంటూ భక్తులు ఆ స్వామివారిని స్మరించారు. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామివారిని వేద పండితులు, అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. తొలుత సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజాదికాలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని కానుకలు సమర్పించారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు ఏడు ప్రదక్షిణలు చేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్నసమారాధన జరిగింది. వేకువజాము నుంచే క్యూలైన్లు నిండిపోయాయి. దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయం, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

పడమటిపాలెం వీఓఏపై ఫిర్యాదు

మలికిపురం: మండలంలోని పడమటిపాలెం వీఓఏ యడ్ల సుమలతపై గ్రామానికి చెందిన నీ కృపా మహిళా సంఘ సభ్యులు ఫిర్యాదు చేశారు. శనివారం ఆ గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభలో ఈ మేరకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఫిర్యాదు ఇచ్చారు. వీఓఏ సుమలత అనేక అక్రమాలకు పాల్పడ్డారని, తమకు వచ్చిన రుణాలు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని ఆ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం 8 మంది సభ్యులకు రూ.5 లక్షలను కేశనపల్లి సిండికేట్ బ్యాంకు రుణం ఇవ్వగా ఒక్కొక్కరికీ రూ.15 వేలు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. తమ ఖాతాలో వేసిన సొమ్మును మాయమాటలు చెప్పి తమతో విత్‌డ్రా చేయించి ఇవ్వలేదని అన్నారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని మహిళలు ఫిర్యాదు చేశారు. గ్రూపు కార్యదర్శి నల్లి నాగలక్ష్మితో కలసి ఆమె ఈ అవకతవకలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. అంతే కాక గ్రామంలో లేకుండా ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి పేరుపైనా ఆమె బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు నడుపుతున్నారని, అలాగే ప్రభుత్వ పథకాల సొమ్ము దారి మళ్లిస్తున్నారని అన్నారు. గత టీడీపీ హయాంలో పసుపు, కుంకుమ సొమ్ము కూడా దారి మళ్లాయని అన్నారు. అక్రమాలను ప్రశ్నిస్తుంటే తమకు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల బలం ఉందని బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఈ మేరకు సంఘ సభ్యులు యడ్ల సీతారత్నం, ఎస్.గీత, టి.మేరి ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. ఫిర్యాదు స్వీకరించిన ఎమ్మెల్యే విచారణ చేయాలని మండల వెలుగు ఏపీఎం వరాలబాబును ఆదేశించారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

కాకినాడ క్రైం: ఓ వ్యక్తి హత్య కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ నెల 15న కాకినాడ తహసీల్దార్ కార్యాలయం ఎదురు రోడ్డులో నివాసం ఉంటున్న ముద్రగడ ఈశ్వర దుర్గాప్రసాద్ (39) హత్యకు గురైన విషయం విధితమే. ఈ ఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. దుర్గాప్రసాద్‌ది కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లి వారిని అక్కడే ఉంచి రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అప్పటికే వ్యభిచార నిర్వహణ వృత్తిలో ఉన్న సామర్లకోట మండలం జి.మేడపాడు గ్రామానికి చెందిన కత్తుల దుర్గతో నాలుగేళ్లుగా ప్రసాద్‌కు అక్రమ సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో ప్రసాద్ దుర్గతో కలసి సుమారు 45 రోజుల కిందట కాకినాడలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురు వీధిలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. ఆ ఇంట్లో దుర్గ వ్యభిచారం నిర్వహిస్తుండేది. ఇలా వ్యభిచారం నిర్వహిస్తూ సంపాదించిన డబ్బు తనకు కావాలని, లేకపోతే దుర్గ భర్తకు జరుగుతున్నదంతా చెప్పేస్తానని బెదిరించాడు. దీంతో భయపడిన దుర్గ తనకు సోదరుడి వరసయ్యే కాకర నాగేశ్వరరావు అతడి స్నేహితుడు పార్ల ప్రసాద్‌తో చెప్పింది. వారు దుర్గాప్రసాద్‌ను చంపే ఉద్దేశంతో శనివారం రాత్రి దుర్గ ఉంటున్న ఇంటికి వచ్చారు. అప్పటికే వ్యభిచారం కోసం వచ్చిన స్త్రీ, పురుషులు ఆ ఇంట్లో ఉన్నారు. వీరు ఐదుగురు కలిసి దుర్గాప్రసాద్‌ను చున్నీ, లెగ్గిన్‌తో కట్టేసి, సీలింగ్ ఫ్యాన్, కిటికీ రాడ్లు, కర్రలతో విచక్షణా రహితంగా కొట్టి చంపారు. చనిపోయాడని నిర్ధారించుకుని అక్కడే బాత్రూం వద్ద మృతదేహాన్ని పడేసి పరారయ్యారు. సాంకేతికత సాయంతో దుర్గ, నాగేశ్వరరావు, ప్రసాద్‌లను శుక్రవారం రాత్రి స్థానిక మెక్లారిన్ స్కూల్ ఆవరణలో గుర్తించి అరెస్టు చేశారు. వ్యభిచారం కోసం వచ్చి హత్యలో పాలుపంచుకున్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు కాకినాడ త్రీ టౌన్ పోలీసులు వెల్లడించారు.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు


కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెనపై రఘు విడిచిపెట్టిన మోటార్ సైకిల్


రఘు (ఫైల్)

కొవ్వూరు: చాగల్లు గ్రామానికి చెందిన బొల్లిపో రఘు (28) స్థానిక రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలో దూకి గల్లంతయ్యాడు. మోటారు సైకిల్‌పై వచ్చి వాహనాన్ని వంతెనపై విడిచిపెట్టి నదిలో దూకినట్లు చెబుతున్నారు. ఈ మేరకు అతని కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు మత్స్యకారుల సాయంతో గోదావరిలో గాలిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రఘు ఆత్మహత్యా యత్నానికి పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. సంఘటనా స్థలంలో ఆధార్ కార్డు, లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి ఆరేళ్లు, రెండేళ్ల వయసు కలిగిన ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. 'అమ్మ, నాన్న, మహిత నన్ను క్షమించు, నేను డబ్బులు మొత్తం పాడు చేశాను. అందుకే చనిపోతున్నా.. పిల్లలు జాగ్రత్త.. మిస్‌యూ సారీ' అంటూ రాసిన లేఖను పోలీసులు సేకరించారు.

ఆకతాయిల చేష్టలే అల్లర్లకు కారణం

- కొవ్వూరులో శాంతియుత వాతావరణానికి పోలీసుల ప్రయత్నం
- శ్రీరామకాలనీ, రాజీవ్ కాలనీల్లో కొనసాగుతున్న పికెట్
- ఇరుపక్షాలతో శాంతి చర్చలు


కొవ్వూరులో రాజీవ్ కాలనీకి వెళ్లే రహదారి దిగ్బంధం చేసి కాపలా కాస్తున్న పోలీసులు

కొవ్వూరు: వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపులో కొందరు ఆకతాయిల చేష్టల కారణంగా చెలరేగిన అల్లర్లు కొవ్వూరులో రెండు వర్గాల మధ్య వివాదంగా మారింది. గురువారం రాత్రి నిమజ్జనోత్సవ ఊరేగింపులో ఆకతాయిల కవ్వింపు చర్యలు ఇరువర్గాల మధ్య కొట్లాట, రాళ్ల దాడికి దారితీసిన విషయం తెలిసిందే. వరుసగా రెండో రోజు శుక్రవారం కూడా ఈ దాడులు కొనసాగడంతో శ్రీరామకాలనీ (తునిపేట), రాజీవ్ కాలనీల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తింది. దీంతో శనివారం కూడా ఈ రెండు కాలనీలు పూర్తిగా పోలీసుల రక్షణ వలయంలో ఉన్నాయి. ఈ నెలాఖరు వరకూ 144 సెక్షన్, సెక్షన్–30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ ప్రకటించారు. మరోవైపు శాంతియుత వాతావరణం కల్పించేందుకు పోలీసులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కుల సంఘాల నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. రెండు కులాలకు చెందిన పెద్దలతో మాట్లాడుతున్నారు. ఇరువర్గాల్లో అల్లర్లకు కారణమైన వ్యక్తులపై కేసు నమోదు చేస్తూనే శాంతి చర్చలు సాగిస్తున్నాయి. అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ జి.దేవకుమార్, ఏఆర్ డీఎస్పీ టీవీఆర్‌కే కుమార్‌లతో పలువురు సీఐలు, ఎస్సైలు, కాకినాడ, కోనసీమ, జిల్లాకు చెందిన బెటాలియన్లు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సమావేశాలు.. శాంతి చర్చలు

ఈ వివాదంపై రాజీవ్ కాలనీలో వాడబలిజ సంఘం కమ్యూనిటీ హాలులో ఆ సంఘ సమావేశం నిర్వహించారు. శ్రీరామ కాలనీ అంబేడ్కర్ విగ్రహం వద్ద మరోవర్గం సమావేశమయ్యారు. దీంతో క్షణక్షణం ఉత్కంఠగా మారింది. మరోవైపు వివిధ ప్రాంతాలకు చెందిన కుల సంఘాల నాయకులు శ్రీరామ కాలనీకి వచ్చి పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. దీంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటోంది. వాడబలిజ సంఘంలో నాయకులతో పట్టణ సీఐ పి.విశ్వం చర్చలు జరిపి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండు కాలనీల్లో పెద్దలతో మాట్లాడి శాంతి కమిటీలు ఏర్పాటు చేయిస్తామన్నారు. భవిష్యత్తులో అల్లర్లకు ఆస్కారం లేకుండా ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. వీధిలైట్లతో పాటు ఏటిగట్టు వైపు వెళ్లే రహదారి పునరుద్ధణ అంశాన్ని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా ముందస్తుగా సమాచారం అందిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. ప్రధానంగా శ్రీరామకాలనీ నుంచి తమ కాలనీకి వచ్చే రహదారి మూయించి వేయాలని సంఘ నాయకులు కోరారు. హైవే వంతెన వద్ద నిత్యం ఆకతాయిల బెడద అధికంగా ఉంటుందని, ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఆకతాయిలు తమ కాలనీకి చెందిన యువతులను సైతం వేధిస్తున్నారని పోలీసులకు వివరించారు. తామంతా దసరా పండగ అనంతరం చేపల వేట నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతామన్నారు. ఆ సమయంలో తమ కుటుంబాలకు రక్షణ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఎస్సీ సంఘ నాయకులు డీఎస్పీని కలసి పలు అంశాలపై చర్చించారు. కొంత మంది ఆకతాయిలు చేసిన చేష్టల కారణంగా తమ కులాన్ని కించపరచడం, ఈ ఘటనకు సంబంధం లేని వ్యక్తుల ఇళ్లపై దాడులకు తెగబడడం ఉపేక్షించబోమని నాయకులు స్పష్టం చేసినట్లు సమాచారం.


రాజీవ్ కాలనీలో వాడబలిజ సంఘ నాయకులతో మాట్లాడుతున్న పట్టణ సీఐ విశ్వం


కొవ్వూరు శ్రీరామకాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశమైన మరోవర్గం నాయకులు

పది మందిపై కేసు

రాజీవ్‌కాలనీకి చెందిన వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం సందర్భంగా తలెత్తిన వివాదంలో భాగంగా శుక్రవారం ఇద్దరు యువకులపై దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పది మందిపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.జగన్ మోహన్‌రావు తెలిపారు. ఈ ఘటనలో పిక్కి శివ, మల్లె చిన్నాలు గాయపడ్డారన్నారు. శివకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.

హోరాహోరీగా టేబుల్ టెన్నిస్ పోటీలు


పెద్దాపురం శ్రీప్రకాష్‌లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

పెద్దాపురం: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో క్లస్టర్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉభయ రాష్ట్రాల సీబీఎస్ఈ పాఠశాలల క్లస్టర్ టీటీ పోటీల్లో భాగంగా రెండో రోజు శనివారం ఆయా విభాగాల్లో బాలుర, బాలికల జట్లు తలపడ్డారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. అండర్–14, 17, 19 బాలురు, బాలికల విభాగాల్లో సుమారు 350 మంది క్రీడాకారులు పోటీల్లో తలపడుతున్నారని అన్నారు.

ఎమ్మెల్సీ తోట చెరువులు ధ్వంసం


పల్లిపాలెంలో జేసీబీలతో చెరువులను ధ్వంసం చేస్తున్న సిబ్బంది


స్థానికులు, మీడియా ప్రతినిధులు వెళ్లకుండా కాపలా కాస్తున్న పోలీసులు

కాజులూరు: కాజులూరు మండలం పల్లిపాలెంలోని వైఎస్సార్ సీపీ నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు చెందిన రొయ్యల చెరువులను అధికారులు ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం.. పల్లిపాలెంలో సుమారు 33 ఎకరాల సాగు భూమిని 20 ఏళ్ల కిందట తోట త్రిమూర్తులు, అతని వర్గీయులు కొనుగోలు చేశారు. ఆపై కొంత భూమిలో రొయ్యల చెరువులు తవ్వారు. తోట త్రిమూర్తులు కొనుగోలు చేసిన భూముల్లో ల్యాండ్ సీలింగ్ భూములు ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేశారంటూ మూడేళ్ల క్రితం మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి లీలాకృష్ణ ఆందోళన చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో శనివారం ఉదయం ఐదు గంటల సమయంలో సుమారు 100 మంది పోలీసులు, 100 మంది రెవెన్యూ సిబ్బంది ఆ భూముల వద్దకు వెళ్లి పొక్లెయినర్, జేసీబీల సహాయంతో చెరువులను ధ్వంసం చేశారు. పల్లిపాలెం, నామవానిపాలెం జంక్షన్లలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి స్థానికులు, మీడియా ప్రతినిధులను అటువైపు వెళ్లకుండా కట్టడి చేశారు. కాగా జరిగిన సంఘటనపై పూర్తి వివరాలు తెలిపేందుకు పోలీసులు, రెవెన్యూ అధికారులు నిరాకరించారు.

పరీక్షకు వెళుతూ మృత్యు ఒడికి..


నిరంజన్, రేవంత్ (ఫైల్)


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న హైవే సిబ్బంది, రూరల్ పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

తుని రూరల్: బంగారు భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కలలు కన్న ఆ ఇద్దరు యువకులు అనుకోని ప్రమాదంలో అశువులు బాశారు. పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్న తపనతో బయలుదేరిన వారిని కారు రూపంలో వచ్చిన మృత్యువు కాటేసింది. ఆదివారం ఎన్‌పీటీఈఎల్ పరీక్ష రాసేందుకు విజయవాడ నుంచి విశాఖపట్నం బయలుదేరిన ఆ యువకుల మోటార్ సైకిల్‌ను తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరు వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై వెనుక కారు నుంచి ఢీకొనడంతో మృతిచెందారు. శనివారం జరిగిన ఈ ఘటన వివరాలను రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. విజయవాడ అయ్యప్ప నగర్‌కు చెందిన నాదెండ్ల నిరంజన్ (19), పోలిశెట్టి రేవంత్ (19) ఆదివారం విశాఖపట్నంలో జరగనున్న ఎన్‌పీటీఈఎల్ పరీక్ష రాసేందుకు మోటార్ సైకిల్‌పై బయలు దేరారన్నారు. విశాఖపట్నం వెళుతున్న కారు ఎర్రకోనేరు వద్ద ముందు వెళుతున్న మోటార్ సైకిల్‌ను వేగంగా ఢీకొంది. దీంతో నిరంజన్, రేవంత్‌లు బైక్‌పై నుంచి పడి రోడ్డును బలంగా ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను అంబులెన్స్‌లో రూరల్ పోలీసులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిరంజన్ మృతి చెందాడు. మెరుగైన వైద్యం అందించేందుకు రేవంత్‌ను కాకినాడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మృతుని బంధువుల ఆందోళన

తమకు జీవనాధారమైన కుమారుడు అర్ధాంతరంగా చనిపోయాడని, న్యాయం చేయాలని మృతుడు నాదెండ్ల నిరంజన్ తల్లి భవాని, బంధువులు డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని డాక్టర్‌ను తప్పించి మరో వ్యక్తిని డ్రైవర్‌గా చూపిస్తున్నారని ఆరోపిస్తూ తుని పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. జాతీయ రహదారిపై మృతదేహాన్ని ఉంచి నిరసన తెలిపారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేస్తామని సీఐ చెన్నకేశవరావు, ఎస్సై కృష్ణమాచారి తెలిపారు. ఇప్పటికే కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేశామన్నారు.

విద్యార్థి దుర్మరణం

రంగంపేట: రోడ్డు ప్రమాదంలో ఓ కళాశాల విద్యార్థి దుర్మరణం పాలైనట్లు ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు. రాజమహేంద్రవరం మోరంపూడికి చెందిన కొప్పిశెట్టి ప్రవీణ్‌కుమార్, కేతా మోహన్ వెంకటసాయి స్నేహితులు. వీరు సూరంపాలెంలోని ఆదిత్య కళాశాలకు బైక్‌పై వస్తుండగా వడిశలేరు దాటిన తరువాత కార్గిల్ ఫ్యాక్టరీ వద్ద ఏడీబీ రోడ్డుపై ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పి మరో బైక్‌ను ఢీకొట్టి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆ విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలిస్తుండగా బైక్ వెనుక కూర్చున్న కేతా మోహన్ వెంకటసాయి (18) మృతి చెందాడు. బైక్ నడుపుతున్న ప్రవీణ్‌కుమార్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

మరణంలోనూ వీడని బంధం

గంటల వ్యవధిలో భార్యాభర్తల మృతి


ఆదిచంద్రరావు (ఫైల్)


నాగవేణి (ఫైల్)

ముమ్మిడివరం: జీవితాంతం తోడుంటానని పెళ్లి రోజున బాసలు చేసిన భర్త అర్ధాంతరంగా మృతి చెందడంతో తట్టుకోలేని భార్య గంటల వ్యవధిలోనే మృతి చెందింది. ఈ ఘటన ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెంలో జరిగింది. ఆ గ్రామానికి చెందిన పోలిశెట్టి ఆదిచంద్రరావు (68) అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. భర్త మరణ వార్త తెలుసుకున్న ఆయన భార్య నాగవేణి (58) తీవ్ర మనస్థాపానికి గురై గంటల వ్యవధిలోనే మృతి చెందింది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఇలా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.